పోలీస్ స్పెషల్ బ్రాంచ్‌లో బదిలీలు

వినాయక్‌నగర్, ఏప్రిల్7 : నిజామాబాద్ పోలీస్ స్పెషల్ బ్రాంచ్‌లో అధికారులు, సిబ్బందిని బదిలీ చేస్తూ సీపీ సాయిచైతన్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాయిచైతన్య సీపీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ విభాగాలపై అధ్యయనం చేశారు. ఏ విభాగంలో ఎంతకాలం నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు, చాలా ఏండ్లుగా ఒకే చోట పనిచేస్తున్నా ఎందుకు బదిలీ చేయలేదు తదితర విషయాలపై ఆరా తీసినట్లు సమాచారం. ఇందులో భాగంగా స్పెషల్ బ్రాంచ్ విభాగంలో పనిచేస్తున్న ఏఎస్సై స్థాయి మొదలుకొని హెడ్ కానిస్టేబుల్ వరకు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ సబ్ డివిజన్ల పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది డ్యూటీ డాటాను పరిశీలించిన సీపీ.. చాలాకాలం నుంచి ఒకేసర్కిల్, స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న వారికి స్థానచలం కల్పించారు. నిజామాబాద్ టౌన్ సర్కిల్, సౌత్, నార్త్, రూరల్ సర్కిల్‌తో పాటు డిచ్‌పల్లి, ధర్పల్లి, ఆర్మూర్, బోధన్, రుద్రూర్ సర్కిళ్ల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని బదిలీ చేస్తూ ఆదేశాలు జారీచేశారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే జైలుకే..

వినాయక్‌నగర్, ఏప్రిల్ 7 : మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారికి జైలుశిక్ష తప్పదని ట్రాఫిక్ అధికారులు హెచ్చరించారు. జిల్లాకేంద్రంలో ద్విచక్రవాహనాలు నడుపుతున్న ఐదుగురు మైనర్లను ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఆధ్వర్యంలో సీఐ ప్రసాద్ సిబ్బందితో కలిసి మైనర్ల తల్లిదండ్రులకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానులకు జరిమానా విధించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరు పర్చుతామని హెచ్చరించారు.

నగరంలో రెండు చోట్ల పోలీసుల దాడులు

- **గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి యువకుల అరెస్ట**

వినాయక్‌నగర్, ఏప్రిల్ 7 : జిల్లాకేంద్రంలో రెండు చోట్ల పోలీసులు సోమవారం దాడులు నిర్వహించి గంజాయి విక్రయిస్తున్న యువకులను అరెస్టు చేశారు. గుర్భాబాది రోడ్డులో కృష్ణ మందిర్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు త్రీటౌన్ ఎస్సై హరిబాబు వెల్లడించారు. యువకుడి నుంచి 55 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, నిందితుడు బీహార్ రాష్ట్రంలోని ఖగారియా జిల్లా బదాస్‌నార్త్ ప్రాంతానికి చెందిన పునీత్‌కుమార్‌గా విచారణలో తేలిందని తెలిపారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నిజామాబాద్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు బైపాస్ రోడ్డులోని నిజాంకాలనీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం సోమవారం దాడులు నిర్వహించింది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో దాడి చేసి గంజాయి రవాణాచేస్తున్న షేక్ ముబీన్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడి నుంచి 250 గ్రాముల గంజాయి తోపాటు బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని, నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించినట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రుద్రూర్/ సారంగాపూర్/ ఇందల్వాయి/ భీమ్‌గల్, ఏప్రిల్ 7 : జిల్లాలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. రుద్రూర్ మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ సురేశ్‌బాబా ప్రారంభించారు. రూరల్ మండలం మల్కాపూర్(ఏ)లో కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ అనిరుధ్, గిర్దావర్ హరీశ్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, ఏపీఎం మహేశ్‌కుమార్ ప్రారంభించారు. ఇందల్వాయి మండలంలోని లోలం, అన్సాన్‌పల్లి, జీకే తండా, సిర్నాపల్లిలో సొసైటీ చైర్మన్లు, అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి, నడ్పల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ప్రభాకర్, ఏపీఎం రజితారెడ్డి, అధికారులు ప్రారంభించారు. భీమ్‌గల్ మండలంలోని ముచ్కూర్, పల్లికొండ, బాచన్‌పల్లి, రహత్‌నగర్, గోన్‌గొప్పుల గ్రామాల్లో ముచ్కూర్ సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ బంగ్లా దేవేందర్, ఉపాధ్యక్షుడు గంగారెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.

‘ప్రజావాణి’కి 70 ఫిర్యాదులు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, ఏప్రిల్ 7 : జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 70 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, ఆర్డీవో రాజేంద్రకుమార్, మెప్మా పీడీ రాజేందర్, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

‘గురుకుల పాఠశాలల్లోని అక్రమాలపై చర్యలు తీసుకోవాలి’

కంఠేశ్వర్, ఏప్రిల్ 7 : గురుకుల పాఠశాలల్లోని అక్రమాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి కర్క గణేశ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కంజర, ధర్మారం(బీ) పాఠశాలల్లో కంప్యూటర్ టీచర్ల అక్రమ నియామకాలు, జోనల్ ఆఫీస్ కేంద్రంగా డిప్యూటేషన్‌పై వచ్చిన అవుట్‌సోర్సింగ్ డాటా ఎంట్రీ ఆపరేటర్ రంజిత్ అవినీతిపై విచారణ చేపట్టాలని కోరారు. అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ టీచర్ల డిప్యూటేషన్ రద్దయినా కంజర పాఠశాలలో కంప్యూటర్ టీచర్ (ఐసీటీ) నాగరాజును అవుట్ సోర్సింగ్ నుంచి హానరోరియంలోకి మార్చారని పేర్కొన్నారు. ఏడాది పాటు కంప్యూటర్ క్లాసులు బోధించకున్నా అదే పాఠశాలల డిప్యూటేషన్ ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్‌లో అంబలి కేంద్రం ప్రారంభం

కంఠేశ్వర్, ఏప్రిల్ 7 :కలెక్టరేట్‌లో టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం ప్రారంభించారు. చల్లని తాగునీటితో పాటు ఉచితంగా అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై టీఎన్జీవో ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్, రాష్ట్ర నాయకుడు గైని గంగారాం పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం

పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

పట్టాభిషేక కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 7 : శ్రీ రామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఖిల్లా రామాలయంలో రాముని పట్టాభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలకు రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరై పూజలు చేశారు. అర్చకులు సుమిత్‌శర్మ, సుమిత్‌పాండే ఆధ్వర్యంలో అభిషేకాలు, పట్టాభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాంబారి మోహన్, ఆలయ చైర్మన్ కాంతయ్య, నాయకులు శక్కరికొండ కృష్ణ, ఒడ్డెం నర్సయ్య, పద్మారావు, రఘునందన్‌రావు, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీ నర్సయ్య, పాషా, గిరి, సాయారెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

నాగారంలో చెత్త సేకరణ ఆటోల అడ్డగింత

- **డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగతో అనారోగ్యం బారిన పడుతున్నామని ఆందోళన**
- **సముదాయించిన మున్సిపల్ కమిషనర్**

స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్

కంఠేశ్వర్/ వినాయక్‌నగర్, ఏప్రిల్ 7 : చెత్త సేకరణ వాహనాలు డంపింగ్ యార్డుకు వెళ్లకుండా నాగారం 300 క్వార్టర్స్ ప్రజలు సోమవారం అడ్డుకున్నారు. డంపింగ్ యార్డుల్లో వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలతో వెలువడుతున్న పొగ కారణంగా అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి డంపింగ్ యార్డులో మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. 10 రోజుల క్రితం సైతం మంటలు చెలరేగినట్లు తెలిపారు. తరచూ అగ్ని ప్రమాదాల పొగ, దుర్వాసన వస్తున్న విషయమై ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా సమస్య పరిష్కారం కాలేదని సీపీఎం నగర కార్యదర్శి సుజాత అన్నారు. మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో స్థానికులు శాంతించారు. డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు జి.గంగాధర్, జి.బాలకృష్ణ, శ్రీధర్, సంతోష్, రాజమణి, సుగుణ, గంగామణి, పద్మ, యమున, లలిత పాల్గొన్నారు.

మూడేండ్ల బాలిక కిడ్నాప్

- **అమ్మమ్మ పక్కన నిద్రిస్తుండగా ఎత్తుకెళ్లిన దుండగుడు**
- **10 రోజుల క్రితమే బాలుడి కిడ్నాప్, హత్య ఘటన మరువకముందే మరో ఘటన**

రమ్య

వినాయక్‌నగర్, ఏప్రిల్ 7 : నిజామాబాద్ జిల్లాకేంద్రంలో అమ్మమ్మ పక్కన నిద్రిస్తున్న మూడేండ్ల బాలిక కిడ్నాప్‌నకు గురైంది. నిజామాబాద్ నగరంలో 10 రోజుల క్రితం 14 నెలల బాలుడి కిడ్నాప్, హత్య ఘటనను మరవకముందే మరో బాలిక కిడ్నాప్ ఆందోళన కలిగిస్తున్నది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారులోని నాగారాం ప్రాంతానికి చెందిన శిరీష భిక్షాటన చేసుకుంటూ తన మూడేండ్ల కూతురు రమ్య, తన తల్లి పోతవ్వతో కలిసి జీవనం కొనసాగిస్తున్నది. ఆదివారం సాయంత్రం తన తల్లి, కూతురితో కలిసి జిల్లాకేంద్రంలోని గాంధీచౌక్ వద్దకు వచ్చిన శిరీష.. వారిని రోడ్డు పక్కన నిద్రించాలని చెప్పి, తాను భిక్షాటన కోసం వెళ్లింది. చాలా సమయం తర్వాత శిరీష వచ్చి చూడగా తన తల్లి పక్కన కూతురు రమ్య కనిపించలేదు. చుట్టుపక్కల బాలిక కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శిరీష వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్‌హెచ్‌వో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. బాలికను ఓ గుర్తుతెలియని దుండగుడు ఎత్తుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయని, త్వరలోనే కిడ్నాపర్‌ను పట్టుకుంటామని ఎస్‌హెచ్‌వో ధీమా వ్యక్తం చేశారు.

సంక్షిప్తంగా...

- **చలివేంద్రం ప్రారంభం -** పొతంగల్, ఏప్రిల్ 7 : మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రతి సోమవారం సంతకి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. సంఘం సభ్యులు జ్యోతి, ప్రణీత, భాగ్యలక్ష్మి, మంజుల, స్వాతి, చంద్రకళ, శ్రీదేవి, సంతోషి, దేవి, వసుధ పాల్గొన్నారు.
- **సంస్కార భారతి కార్యవర్గం ఎన్నిక-** సుభాష్‌నగర్, ఏప్రిల్ 7 : సంస్కార భారతి ఇందూరు శాఖ నూతన కార్యవర్గాన్ని బోర్గాంలో ఉన్న మాతృ సంస్థ కార్యాలయంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజ్‌కుమార్ సుబేదార్, ఉపాధ్యక్షుడిగా సముద్రాల శ్రీనివాసాచారి, కోశాధికారిగా రాధాకృష్ణ, కళావిభాగం కన్వీనర్‌గా రవికుమార్ తదితరులను ఎన్నుకున్నారు.
- **బీసీ హక్కుల సాధన సమితి సభ్యత్వ నమోదు ప్రారంభం -** ఖలీల్‌వాడి, ఏప్రిల్ 7 : బీసీ హక్కుల సాధన సమితి సభ్యత్వ నమోదును సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 42 శాతం బీసీలకు రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఓమయ్య, జిల్లా నాయకులు కె.రాజన్న, బీసీ హక్కుల సాధన సమితి సభ్యులు చక్రపాణి, హన్మాండ్లు, గంగాధర్, సాయినాథ్, ప్రకాశ్, ఆనంద్ పాల్గొన్నారు.
- **ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలన -** ధర్పల్లి, ఏప్రిల్ 7 : మండలంలోని సీతాయిపేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ఎంపీడీవో బాలకృష్ణ సోమవారం పరిశీలించారు. మరో ఐదు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోసి మార్కవుట్ చేశారు. అనంతరం గ్రామంలోని నర్సరీ పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి కృష్ణకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.
- **పాల్దాలో ఆరోగ్య శిబిరం -** సారంగాపూర్, ఏప్రిల్ 7 : మండలంలోని పాల్దా గ్రామంలో ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ - 4 ఆధ్వర్యంలో వేసవి శిబిరం కొనసాగుతున్నది. సన్‌రైజ్ దవాఖాన ఆధ్వర్యంలో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 220 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్ల రాజమణి, డాక్టర్ ప్రపంతి, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ నరేశ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ధీరేందర్, వీడీసీ చైర్మన్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన తాళ్లరాంపూర్ గ్రామస్తులు

గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

ఏర్గట్ల, ఏప్రిల్ 6: వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని తాళ్లరాంపూర్ వీడీసీ సభ్యులతోపాటు ఇంటికి ఇద్దరు చొప్పున దాదాపు 200 మంది గ్రామస్తులు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. గ్రామస్తుల కథనం మేరకు.. ఏతా మాదిరిగానే శ్రీరామనవమికి ఒక రోజు ముందు శనివారం గౌడ సామాజిక వర్గానికి చెందిన మహిళలు కుంకుమార్చన పూజచేసేందుకు గ్రామ రామాలయానికి వెళ్లారు. అక్కడున్న కొందరు వీడీసీ సభ్యులు, పూజారి సదరు మహిళలను అడ్డుకుని అవమానించినట్లు తెలిసింది. మనస్థాపానికి గురైన మహిళలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం ముగ్గురు వీడీసీ సభ్యులు, పూజారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు సోమవారం పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. కొంతకాలంగా వీడీసీ, గౌడ సంఘానికి మధ్య జరుగుతున్న గొడవల్లో భాగంగానే తమపై మహిళలు తప్పుడు ఫిర్యాదు చేశారని వీడీసీ సభ్యులు ఆరోపించారు. పోలీసులతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. భీంగల్ సీఐ సత్యనారాయణ గౌడ్ అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. తాము తప్పు చేయలేదని, ఉద్దేశపూర్వకంగా గౌడ కులస్తులు ఆరోపణలు చేస్తున్నారని సీఐకి వీడీసీ సభ్యులు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని సీఐ వెళ్లడించారు.

ఇరు వర్గాల మధ్య కొద్దికాలంగా గొడవలు

కొంతకాలం నుంచి వీడీసీ సభ్యులు, గౌడ కులస్తులకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఏటా గీత కార్మికులు వీడీసీకి కొంత నగదు ఇవ్వడం అనవాయితీగా వస్తున్నది. ఈత చెట్లు లేకపోవడంతో ఈ ఏడాది నగదు ఇవ్వడానికి గీత కార్మికులు నిరాకరించినట్లు తెలిసింది. తాటి చెట్లు గీయాలనే వీడీసీ డిమాండ్‌కు గీత కార్మికులు ఒప్పుకోలేదని సమాచారం. దీంతో గీత కార్మికులపై వీడీసీ వారు కక్ష చర్యలకు పాల్పడినట్లు తెలిసింది. గీత కార్మికుల వద్ద గ్రామస్తులు కల్లు తాగకూడదని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఇతర గ్రామాల నుంచి వచ్చే వారు కూడా కల్లుతాగకుండా వీడీసీ అడ్డుకుంది. వేరే గ్రామాలకు చెందిన గౌడ కులస్తులతో గ్రామంలో చెట్లు గీయించేందుకు సిద్ధం కావడంతో ఇరు వర్గాల మధ్య గొడవలు ఎక్కువయ్యాయని తెలిసింది.

ఆకట్టుకున్న ఆర్మీ పారా గ్లైడింగ్ విన్యాసాలు

యాత్రికులతో అదనపుకలెక్టర్ కిరణ్‌కుమార్, అధికారులు

పారా గ్లైడింగ్ చేస్తున్న యాత్రికుడు

కంఠేశ్వర్, ఏప్రిల్ 7 : జిల్లాకేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం సాయంత్రం ఆర్మీ అధికారుల నేతృత్వంలో నిర్వహించిన పారా గ్లైడింగ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. 250వ ఏఓసీ కార్ప్స్‌డేను పురస్కరించుకుని సికింద్రాబాద్ ఆర్మీ కంటోన్మెంట్ ఆధ్వర్యంలో పారా మోటార్ ఎక్స్ ఫెడిషన్ -2025 పేరుతో యాత్రను చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర సోమవారం నిజామాబాద్ నగరానికి చేరుకున్నది. యాత్రకు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, అధికారులు స్వాగతం పలికారు. జీజీ కళాశాల మైదానంలో సికింద్రాబాద్ ఆర్మీ కంటోన్మెంట్ లెఫ్టినెంట్ కల్నల్ అమృత్ నేతృత్వంలో నిర్వహించిన పారా గ్లైడింగ్ విన్యాసాలు అలరింపజేశాయి. ఎన్‌సీసీ కెడెట్లు, యువతకు పారా గైడింగ్‌పై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ అరవింద్‌రెడ్డి, సివిల్ సప్లయీస్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, పోలీసు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

పారామోటార్ ఎక్స్ ఫెడిషన్ యాత్రకు స్వాగతం పలికిన అదనపు కలెక్టర్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కంఠేశ్వర్, ఏప్రిల్ 7 : డీ-6 సెక్షన్ ప్రాంతంలో మంగళవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని 1వ టౌన్ ఏడీఈ చంద్రశేఖర్, డీ-6 ఏఏఈ రావుఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీని పెంచుతున్న నేపథ్యంలో అర్సపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు.

10 నుంచి 14 వరకు జార్జిరెడ్డి వర్ధంతి సభలు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 7 : పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి 53వ వర్ధంతి సభలు ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ పిలుపునిచ్చారు. టీయూలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ప్రిన్స్, దేవిక, రవీందర్, హుస్సేన్, ఆకాశ్, రాజు, హన్మాండ్లు, విజయ్, సాయి, రాము పాల్గొన్నారు.

ఆర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర సచ్‌దేవాను ఢిల్లీలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏథిక్స్ అండ్ డిసిప్లిన్ కమిటీ చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి సోమవారం కలిసి సత్కరించారు. ఈగ సంజీవ్‌రెడ్డి వెంట తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, ఆర్చరీ ఫెడరేషన్ ఆలిండియా సంయుక్త కార్యదర్శి గుంజన్ ఉన్నారు.

ఇటీవల మృతిచెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాలకు రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల క్రైస్తవులు సోమవారం సాయంత్రం నివాళులర్పించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి ప్రాంగణంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. పాస్టర్ మృతిపై నిస్పాక్షికంగా విచారణ జరిపించాలని కోరారు.

- డిచ్‌పల్లి, ఏప్రిల్ 7

హిందూ ధర్మం ఎంతో గొప్పది

వేల్పూర్, ఏప్రిల్ 7: హిందూ ధర్మం ఎంతో గొప్పదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. సోమవారం వేల్పూర్‌లో హనుమాన్ దీక్ష భక్తులకు భిక్ష (అన్నదానం)ను ఎమ్మెల్యే ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని జంబి హనుమాన్ ఆలయం వద్ద దీక్ష సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ దీక్ష భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, హనుమాన్ దీక్ష భక్తులు పాల్గొన్నారు.

పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దంపతులు

భిక్ష స్వీకరిస్తున్న హనుమాన్ భక్తులు

కమ్మ కులస్తులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి

కమ్మ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు

బోధన్, ఏప్రిల్ 7: సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ కమ్మ కులస్తులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. సోమవారం బోధన్ పట్టణ శివారులోని ఘన్‌పూర్ క్రాస్‌రోడ్స్ వద్ద నిర్మించిన కమ్మ సంఘం భవనాన్ని ఆయన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. కమ్మ సంఘం భవనం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మాజీ సీఎం, దివంగత ఎన్టీ రామారావు విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో అరికెపూడి గాంధీ, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు మాట్లాడారు. కమ్మ కులస్తులు అన్ని రంగాల్లోనూ ఎంతో ఎదగారన్నారు. కార్యక్రమానికి కమ్మ సంఘం అధ్యక్షుడు పల్లెం పాటి శివన్నారాయణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో తెలంగాణ కమ్మ సేవా సంఘాల గౌరవ అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే నల్ల మోతు భాస్కర్‌రావు, రాష్ట్ర హస్తకళల సంస్థ మాజీ చైర్మన్ ముమ్మలనేని అమర్‌నాథ్‌బాబు, ప్రముఖ సంఘ సేవకుడు ముమ్మలనేని రాజశేఖర్, బోధన్ కమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి హరినాథ్‌బాబు, కోశాధికారి పల్లెంపాటి శ్రీధర్, ప్రతినిధులు పి.గాంధీ, ఈవీ రంగారావు, పావులూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ సునీల్‌కుమార్ చౌదరి. ద్రోణవల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రూ.500 అడిగితే ఇవ్వలేదని.. ఆత్మహత్య

నవీపేట, ఏప్రిల్7: తన తండ్రి రూ.500 ఇవ్వనందుకు మనస్థాపం చెందిన ఓ కొడుకు జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అబ్బాపూర్(ఎం) గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై వినయ్ కథనం.. గ్రామానికి చెందిన బట్టు నరేశ్(35) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తన తల్లిని నవీపేటలోని ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లి తరిగి ఇంటికి వచ్చాడు. ఈ విషయంలో ఇంట్లో చెప్పకుండా నవీపేటకు ఎందుకు వెళ్లావని నరేశ్‌తో ఆయన భార్య గౌతమి ఘర్షన పడింది. అంతలోనే తనకు అవసరం నిమిత్తం రూ.500 కావాలని తండ్రి నడ్పి ఒడ్డెన్నను అడిగాడు. తండ్రి డబ్బులు ఇవ్వక పోవడంతో మనస్థాపానికి గురైన నరేశ్ ఇంట్లోకి వెళ్లి ఉరేసుక